సాక్షి
గుంటూరు
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023




కార్తికేయుడి సన్నిధిలో భక్తజనం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : దుర్గగుడి లో నిత్యాన్నదానానికి విజయవాడ కామకోటినగర్‌కు చెందిన సీహెచ్ రాధాకృష్ణ కుటుంబం రూ.లక్ష విరాళం అందజేసింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 3,711 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి అమరేశ్వరుని పవిత్రోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ తెలిపారు. ఆదివారం ఆయన పవిత్రోత్సవ కార్యక్రమాల గురించి వెల్లడించారు. ఆలయ ఉప ముఖ్య అర్చకులు కైతేపల్లి సుధీర్‌శర్మ, స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో మూడురోజులపాటు త్రయాహ్నిక దీక్షతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. మొదటి రోజున ఉదకశాంతి, ఆలయశుద్ధి, ప్రధాన, ఉపాలయాల మూర్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. రెండవ రోజు మంగళవారం మండప పూజలు, దీక్షాహోమాలు, మూల మంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్ర ధారణ, చండీహోమం, మూడవ రోజు బుధవారం కాస్మాండ హోమాలు, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహూతి, కలశ ఉద్వాసన, పవిత్ర విసర్జన, అవభృతము మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

ఇంద్రకీలాద్రిపై గణపతి హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రిపై గణనాథుడికి పంచామృత అభిషేకాలు, గణపతి హోమం చేశారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో వినాయకుడి విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం గణపతి మంత్ర హవనం (హోమం) శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రతి నెలా చవితి రోజున సంకట హర చతుర్థిని చేస్తున్నారని ఆలయ అర్చకులు పేర్కొంటున్నారు. వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

500 మందికి ఉచిత వరలక్ష్మీవ్రతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకుని సెప్టెంబర్ 8న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతానికి అవసరమైన దరఖాస్తులను ఆదివారం నుంచి అందజేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచే మహిళలు పెద్ద ఎత్తున మహామండపం నాలుగో అంతస్తులోని ఫెస్టివల్ విభాగానికి తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి దరఖాస్తుల జారీ ప్రక్రియ ప్రారంభించారు. ఆధార్‌కార్డుతో వచ్చిన వారి వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తులను అందజేశారు. శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతంలో ఐదు వందల మంది పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పిస్తుందని సెక్షన్ సూపరింటెండెంట్ హేమదుర్గాంబ పేర్కొన్నారు. దరఖాస్తులు తీసుకున్న వారు 8వ తేదీ ఉదయం 9 గంటలకే మహా మండపం ఆరో అంతస్తుకు చేరుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 523.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 850.90 అడుగుల వద్ద ఉంది.

దత్తపీఠంలో యోగాసనాల పోటీలు

విజయవాడ : పటమటలోని గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమం దత్తపీఠంలో ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్రస్థాయి సూర్యనమస్కారాలు, యోగాసనాల పోటీలు నిర్వహిస్తున్నట్లు దత్తక్రియ యోగా విజయవాడ శాఖ సీనియర్ బోధకుడు దంతులూరి తిరుపతి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్నవారు 92970 52499 నంబర్‌లో దత్త క్రియా యోగా పోటీలు అని వాట్సాప్ మెసేజ్ చేస్తే రిజిస్ట్రేషన్‌కు గూగుల్ ఫామ్ పంపుతామని, ఆ ఫారాల్ని సెప్టెంబర్ 9వ తేదీ లోపు తమకు పంపాలని సూచించారు.

నిశ్శబ్ద నిశీధిలో విషాద గీతిక

శుభకార్యాల్లో అతిథులకు కొసరికొసరి వడ్డించె ఆ బతుకులపై విధి పగబట్టిందో ఏమో.. పనిముగించుకుని ఆటోలో సొంతూరుకు తిరుగుపయనమైన బడుగు జీవులపై కన్నెర్ర చేసింది. రోజంతా తీరకలేని పనిభారంతో అలసిసొలసిన తనువులు కాస్త విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు పంజా విసిరింది. నిశ్శబ్ద నిశీధిలో విషాద గీతిక ఆలపించింది. ఆర్తనాదాలు, హాహాకారాలతో వికటాట్టహాసం చేసింది. ఐదు ప్రాణాలను చీకటి తెరతోపాటే గాలిలో కలిపేసింది. ఆ కుటుంబాలకు పెనుదుఃఖాన్ని మిగిల్చింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం తెల్లవారుజామున బాపట్ల జిల్లా సంతమాగులూరు వద్ద జరిగింది.

- ఆటోను లారీ ఢీకొని ఐదుగురి దుర్మరణం
- క్యాటరింగ్ పనులకు వెళ్లి వస్తుండగా ఘోరప్రమాదం
- బాపట్ల జిల్లా సంతమాగులూరు వద్ద దుర్ఘటన
- మృతులంతా గుంటూరు వాసులే

నరసరావుపేటటౌన్: గుంటూరుకు చెందిన చెలిమెళ్ల కవిత(19), పల్లం నారీనాయక్(22), బుర్రి మాధవి(35), అలివేలు మంగతాయారు(24), తమ్మిశెట్టి తులసి(16), సలికండి విజేత క్యాటరింగ్ పనులు చేస్తుంటారు. మార్కాపురంలోని సెవెన్ హిల్స్ కల్యాణ మండపంలో నిర్వహించే పెళ్లిలో పనిచేసేందుకు ఒప్పుకున్నారు. ఆరుగురూ కలిసి గుంటూరుకు చెందిన పల్లం రాజునాయక్ ఆటోను బాడుగకు మాట్లాడుకుని శనివారం ఉదయం వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి అర్ధరాత్రి 12 గంటలకు గుంటూరు బయలుదేరారు. అప్పటికే అలసిసొలసి ఉండడంతో ఆటోలో విశ్రాంతి తీసుకున్నారు. మార్గమధ్యలో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు బాపట్ల జిల్లా సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ దుర్ఘటనలో చెలిమెళ్ల కవిత, పల్లం నారీనాయక్, బుర్రి మాధవి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 సహాయంతో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అలివేలు మంగతాయారు, తమ్మిశెట్టి తులసి మరణించారు. ఆటో డ్రైవర్ రాజునాయక్ పరిస్థితి విషమంగా ఉంది. అతడిని మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలాన్ని బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు.

వైద్యశాల వద్ద హాహాకారాలు

ప్రమాదంలో మృతి చెందిన ఐదు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుల బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో వైద్యశాల వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల రోదనలతో వైద్యశాల మిన్నంటింది.

మృతదేహాలను పరిశీలించిన ఆర్డీఓ, డీఎస్పీ

ఏరియా వైద్యశాలలో మృతదేహాలను బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, చీరాల ఆర్డీఓ సరోజని పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంతమాగులూరు సీఐ ప్రభాకర్, సంతమాగులూరు తహసీల్దార్ ప్రశాంతి ఆధ్వర్యంలో మృతదేహాలకు శవ పంచనామా నిర్వహించారు. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతదేహాలను బంధువులకు అప్పగించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

అన్నీ రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులే..

గుంటూరు ఈస్ట్: సంతమాగులూరు వద్ద జరిగిన ప్రమాదంలో మరణించిన తులసి, అలివేలు మంగతాయారు, కవిత, నారీనాయక్ కుటుంబాలవి రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులే. వీరు పొట్టకూటి కోసం ఎక్కడ పని ఉంటే అక్కడకు వెళ్లి నాలుగురాళ్లు తెచ్చుకుని జీవిస్తున్నారు.

- నల్లచెరువు 3వ లైనుకు చెందిన చెలిమెల్ల ఆంజనేయులు కుమార్తె కవిత, గుంటూరు నగరానికి చెందిన పి.సకూర్ నాయక్ కుమారుడు నారీ నాయక్ ఇద్దరూ క్యాటరింగ్ పనులు చేస్తూ కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో వారు మరణించడంతో ఆ కుటుంబాలు గుండెలవిసేలా రోదిస్తున్నాయి.
- నల్లచెరువు 3వ లైనుకు చెందిన తమ్మిశెట్టి వీరాస్వామికి ముగ్గురు కుమార్తెలు. వీరంతా క్యాటరింగ్ పనులకు వెళ్తారు. మూడో కుమార్తె తులసి 9వ తరగతి వరకు చదివి మానేసింది. క్యాటరింగ్ పనులకు వెళ్తుంది. శనివారం తోటి కార్మికులతో కలిసి పనికి వెళ్లి ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది.



మృతి చెందిన తమ్మిశెట్టి తులసి

- నల్లచెరువు 1వ లైనుకు చెందిన శివశంకర్, అతని భార్య అలివేలు మంగతాయారు చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈమె కూడా శనివారం క్యాటరింగ్ పనులకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించింది. దీంతో భర్త శివశంకర్ తీవ్రంగా విలపిస్తున్నారు.



మంగతాయారు మృతదేహం



మృతదేహం వద్ద రోదిస్తున్న తులసి కుటుంబ సభ్యులు



ప్రమాదానికి కారణమైన లారీని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

అమ్మ లేదని పిల్లలు విలవిల



బుర్రి మాధవి (ఫైల్)

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామానికి చెందిన బుర్రి మాధవి, ఆమె భర్త రమేష్ ఇద్దరూ రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. చిన్నకుమార్తె 7వ తరగతి, పెద్దకుమార్తె 10వ తరగతి స్థానిక పాఠశాలలోనే చదువుతున్నారు. శనివారం తోటి కార్మికులతో కలిసి క్యాటరింగ్ పనులకు వెళ్లిన మాధవి తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదంలో మరణించడంతో భర్త, ఇద్దరు ఆడపిల్లలు హతాశులయ్యారు. అమ్మ మరణంతో పిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే రమేష్ ఘటనా స్థలికి వెళ్లారు. కాయకష్టంతో ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నామని, ఇంతలో విధి పగబట్టిందని తీవ్రంగా విలపిస్తున్నారు.

ముగ్గురు అధ్యాపకులకు ఉత్తమ అవార్డులు

గురుపూజోత్సవం నాడు అవార్డుల ప్రదానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు అధ్యాపకులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె.మధుబాబు, సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య వి వెంకటేశ్వర్లు, ఫుడ్ అండ్ న్యూట్రీషనల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కేవీ శాంతిశ్రీ అవార్డులకు ఎంపికైన వారిలో ఉన్నారు. ఈ ముగ్గురు ఈనెల 5వ తేదీన విశాఖపట్నంలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో అవార్డులు అందుకోనున్నారు.

సోషియాలజీ 'విక్టరీ' వెంకటేశ్వర్లు



ఆచార్య వి.వెంకటేశ్వర్లు ప్రస్తుతం యూనివర్సిటీ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'ప్రోబ్లమ్స్ ఆఫ్ ద రూరల్ ఏజ్‌డ్: ఏ సోషియాలజికల్ పర్‌స్పెక్టివ్: (ఏ కేస్ స్టడీ ఆఫ్ మంగళగిరి మండల్ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అనే అంశంపై డాక్టరేట్ చేశారు. ఈయన పర్యవేక్షణలో 25 పీహెచ్‌డీలు, ఆరు ఎంఫిల్ డిగ్రీలు ప్రదానం చేశారు. ప్రస్తుతం 06 పీహెచ్‌డీలకు పర్యవేక్షణ చేస్తున్నారు. 52 అంతర్జాతీయ జర్నల్స్‌లో, 27 జాతీయ జర్నల్స్‌లో ఆర్టికల్స్, 85 పుస్తకాలు ప్రచురించారు. 15 అంతర్జాతీయ జర్నల్స్‌లో, 172 జాతీయ స్థాయి జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలు సమర్పించారు. యూకేకి చెందిన రాయల్ వెటరినరీ కాలేజ్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న రీసెర్చ్‌లో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఆర్థికంలో 'మధు'ర బోధన



ఆచార్య కె మధుబాబు ప్రస్తుతం యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎకనామిక్స్ విభాగాధిపతిగా, బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్‌గా, యూనివర్సిటీ సీడీసీ డీన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్- ఏ డిస్ట్రిక్ట్ వైజ్ ఎనాలసిస్(1981-2001) అనే అంశంపై డాక్టరేట్ చేశారు. ఈయన పర్యవేక్షణలో 18 పీహెచ్‌డీలు, 03 ఎంఫిల్ డిగ్రీలు ప్రదానం చేశారు. ప్రస్తుతం 06 పీహెచ్‌డీ, 02 ఎంఫిల్ పరిశోధనలు కొనసాగుతున్నాయి. గతంలో ఇండో ఆసియన్ ఆథర్ లెవిస్ డిస్టింగ్విష్డ్ ఎకనమిస్ట్ అవార్డ్, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ అమెరికా నుంచి హానరరీ డాక్టరేట్ అవార్డు, ఏఎన్‌యూ నుంచి బెస్ట్ ఇంటర్నేషనల్ పబ్లికేషన్ అవార్డును అందుకున్నారు. పలు ఎకనామిక్ అసోసియేషన్స్‌లో లైఫ్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో 17 ఆర్టిక్స్, జాతీయ స్థాయిలో 34 ఆర్టికల్స్, 20 పుస్తకాలు, అంతర్జాతీయ సదస్సులో 06 పరిశోధనా పత్రాలు, జాతీయ సదస్సులో 77 పరిశోధనా పత్రాలు, రీజినల్, రాష్ట్ర స్థాయి సదస్సుల్లో 12 పరిశోధనా పత్రాలు సమర్పించారు.

పరిశోధనలకు శాంతి'శ్రీకారం'



డాక్టర్ కేవీ శాంతిశ్రీ ప్రస్తుతం యూనివర్సిటీ సైన్స్ కళాశాల ఫుడ్ అండ్ న్యూట్రీషన్ సైన్స్ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'ఇన్వెస్టిగేషన్ ఆన్ అడాప్షన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీజెస్ ఫర్ రెడ్‌గ్రామ్ క్రాప్ బై ద ఫార్మర్స్ ఆఫ్ ప్రకాశం డిస్ట్రిక్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్, ఇండియా' అనే అంశంపై డాక్టరేట్ చేశారు, నెట్, స్లెట్ అర్హత సాధించారు. 24 జర్నల్స్‌లో ఆర్టికల్స్ ప్రచురించారు. 56కిపైగా సదస్సులు, కార్యక్రమాలకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. 50కిపైగా జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించారు. పలు రేడియో, టీవీ కార్యక్రమాలలో ఫుడ్ అండ్ న్యూట్రీషన్ అంశాలపై ప్రసంగాలిచ్చారు. ఈమె పర్యవేక్షణలో ఆరు పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు.

• నవానంద జలసిరి



ఆకాశ గంగ పుడమితల్లిపై ప్రేమధార కురిపించిందా.. భూమాతను వర్షపుజల్లులతో అభిషేకించిందా.. అన్నట్టు వాగులు, వంకలు పరవళ్లుతొక్కాయి. బీడులైన చేలను ముద్దాడుతూ ఉరకలెత్తాయి. ఫలితంగా మాచర్ల మండలం ఎత్తిపోతల జలపాతం నవ కళ సంతరించుకుంది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 70 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న సుజలధారలు సుమనోహరంగా దర్శనమిచ్చాయి. పర్యాటకులను మంత్రముగ్ధులను చేశాయి.

- విజయపురిసౌత్

డాక్టర్ సుందరాచారికి స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు

గుంటూరుమెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారికి స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. యూనివర్సిటీలు, కాలేజ్ టీచర్స్‌కు 2023 సంవత్సరానికి స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డులను హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ జె. శ్యామల రావు ఆదివారం ప్రకటించారు. యూనివర్సిటీ టీచర్స్‌లో 40 మందిని బెస్ట్ టీచర్స్‌గా ప్రకటించగా అందులో వైద్యరంగం నుంచి ఇరువురిని ప్రకటించారు. వారిలో తిరుపతి సిమ్స్‌కి చెందిన డాక్టర్ అపర్ణ, గుంటూరు వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ సుందరాచారి ఉన్నారు. గత నెలలో న్యూరాలజీ డిపార్టుమెంట్‌లో రోగులకు చేస్తున్న వైద్య సేవలకుగాను స్వాతంత్య్ర వేడుకల్లో బెస్ట్ డాక్టర్ అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. న్యూరాలజీ వైద్య విభాగంలో రెండున్నర దశాబ్దాలుగా ఆయన చేస్తున్న సేవలకుగాను గతేడాది ఆగస్టులో అరుదైన గౌరవం దక్కింది. ఫెల్ ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీగా ఎన్నికయ్యారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి విభాగాధిపతిగా...

డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి 1981లో గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివారు. న్యూరాలజీ పీజీ పూర్తిచేసిన పిదప చదువుకున్న మాతృసంస్థకు సేవచేయాలనే లక్ష్యంతో 2001లో జీజీహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొంది నేడు విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో చేరిన నాటినుండి పీజీ వైద్య విద్యార్థుల బోధన మెరుగుపడేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. న్యూరాలజీలో ఒకేసారి నాలుగు పీజీ సీట్లు గుంటూరు జీజీహెచ్‌కు వచ్చేలా చేసి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. పలుమార్లు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పీజీ పరీక్ష ఫలితాల్లో డాక్టర్ సుందరాచారి మార్గదర్శకత్వంలో పీజీ వైద్యులు తమ సత్తా చాటి ప్రథమస్థానాలు గెలుచుకున్నారు. ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతుల మిన్నా అనే సూక్తిని తూచా తప్పకుండా పాటిస్తూ మదర్‌థెరిస్సా స్ఫూర్తితో వైద్యరంగాన్ని అందులో డాక్టర్ వృత్తిని ఎంచుకుని ఎందరో పేద రోగులకు వైద్యసేవలను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా న్యూరాలజీ వైద్య విభాగాన్ని అభివృద్ధి చేసి కార్పొరేట్ వైద్యసేవలను పేదలకు ఉచితంగా అందిస్తున్నారు. ఉమ్మడి ఏపీలో ఏ ప్రభుత్వ ఆస్పత్రుల్లో లేని విధంగా గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డులో బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల కోసం ప్రత్యేకంగా యూనిట్ ఏర్పాటు చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు. నిద్ర సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చెక్‌పెట్టే స్లీప్‌ల్యాబ్‌ను సైతం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేయించారు. న్యూరాలజీ వైద్య విభాగంలో అందిస్తున్న నాణ్యమైన వైద్యసేవలకు గుర్తింపుగా 2018 జూన్‌లో రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆస్పత్రుల్లో లేని విధంగా న్యూరాలజీ వైద్య విభాగానికి ఐఎస్‌ఓ గుర్తింపు లభించింది. స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైన డాక్టర్ సుందరాచారికి గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, న్యూరాలజిస్టుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ, పలువురు న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు అభినందనలు తెలిపారు.



డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి

అశ్రునివాళి



శ్రీ సువ్వల శ్రీనగేష్
జననం 13.01.1966
నరెడ్కో AP రాష్ట్ర అధ్యక్షులు
మరణం: 23.08.2023
మా అందరికి ప్రేమను పంచిన స్నేహం, ఆపదలో మమ్ము ఆదరించిన బంధం,
ఒడిదుడుకుల్లో మా వెన్నుతట్టిన ధైర్యం, కుటుంబ సభ్యులు, స్నేహితులను వీడి
హఠాత్మరణం చెందడం నమ్మలేనిది... విషాదమైనది.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
కుటుంబ సభ్యులు, స్నేహితులు
NAREDCO ANDHRA PRADESH
పెద్దకర్మ మరియు సంతాపసభ: ది.04.09.2023 వ తే. గం॥ 11.00 నుండి A1 కన్వెన్షన్, బీచ్‌రోడ్, ఋషికొండ, విశాఖపట్నం నందు జరుగును

క్లుప్తంగా

రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మృతి

చీరాల రూరల్: రెండు వేర్వేరు చోట్ల జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందిన ఘటనలు ఆదివారం స్టూవర్టుపురం- బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకున్నాయి. స్టూవర్టుపురం-బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్య కంకటపాలెం రైల్వే గేటు, రిలయన్స్ పెట్రోలు బంకు వెనుక దిగువ రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చీరాల జీఆర్పీ ఎస్ఐ సీహెచ్. కొండయ్య తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, 5.5 ఎత్తు కలిగి ఉన్నాడన్నారు. మృతుడు నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో ఘటనలో..

స్టూవర్టుపురం-బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్య దిగువ లైన్‌పై గుర్తు తెలియని మరో వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ కొండయ్య తెలిపారు. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని, 5.6 అడుగులు ఎత్తు ఉన్నాడని చెప్పారు. సిమెంటు రంగు నిండుచేతులు చొక్కా, నీలం రంగు లోయర్ ధరించి ఉన్నాడని వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు మృతదేహాల వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. వివరాలకు 94406 27646కు కాల్ చేయాలని సూచించారు. ఈ రెండు ఘటనల్లో మృతులు రైలులో ప్రయాణిస్తూ జారిపడి మృతి చెంది ఉండవచ్చని ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువ రైతు మృతి



మార్టూరు: ట్రాక్టర్ బోల్తాపడి యువ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని కోలలపూడిలో ఆదివారం జరిగింది. కోలలపూడికి చెందిన సాధినేని కోటేశ్వరరావు కుమారుడు అశోక్ (30) ట్రాక్టర్‌పై పొలానికి వెళుతున్నాడు. గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన గేదెల్ని తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. దాని కింద పడి తీవ్ర గాయాలైన అశోక్‌ను స్థానికులు బయటకు తీశారు. 108లో గుంటూరు తరలిస్తుండగా, రాజుపాలెం సమీపం చేరేసరికి పరిస్థితి విషమించి అశోక్ మృతి చెందాడు.

ప్రజలకు సైన్స్ ఫలాలు అందించడమే జేవీవీ లక్ష్యం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: శాస్త్ర, సాంకేతిక ఫలాలు సామాన్య ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. రైలుపేటలోని కన్నా స్కూల్లో జేవీవీ 17వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అక్షరాస్యత ఉద్యమం, మద్యపాన వ్యతిరేక పోరాటం, పర్యావరణ పరిరక్షణ, మూఢ నమ్మకాల నిర్మూలన, శీతల పానీయాలు, జంక్ ఫుడ్స్‌కు వ్యతిరేకంగా 35 ఏళ్లుగా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ కన్నా మాస్టారు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి పర్చేందుకు జేవీవీ చెకుముకి సైన్స్ సంబరాలు, బాలోత్సవం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోందని అన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎ.ఆంజనేయులు, డాక్టర్ ఏఎస్ ప్రసాద్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా షేక్ అహ్మద్ హుసేన్, ఎం.ఉదయ్‌భాస్కర్, కోశాధికారిగా జి.వెంకట్రావు, కార్యదర్శులుగా టి.అరుణ్‌కుమార్, సీహెచ్ రాము, బి.శంకర్‌సింగ్, ఇ.రాధ, టీఆర్ రమేష్, బి.ఉదయ్ భాస్కర్, బి.ప్రసాద్, ఎస్ఎం సుభానీ ఎన్నికయ్యారు.

నార్త్‌జోన్ జట్టుపై సెంట్రల్‌జోన్ విజయం



సెంట్రల్‌జోన్ క్రీడాకారిణి దయానా(57)



బౌలర్ ధాత్రి (4 వికెట్లు)

మంగళగిరి: నార్త్‌జోన్, సెంట్రల్ జోన్ జట్ల మధ్య ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కార్పొరేషన్ పరిధి నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అండర్ -23 ఉమెన్ ఇంటర్ జోనల్స్ వన్డే క్రికెట్ మ్యాచ్ పోటీలు నిర్వహిస్తున్నారు. తొలుత టాస్ గెలిచిన సెంట్రల్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. నార్త్‌జోన్ 40.5 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. జట్టు క్రీడాకారిణిలు వై.హేమ రోషిణి 55 బంతుల్లో ఒక ఫోర్‌తో 26 పరుగులు, సీహెచ్ మెహర్ లహరి 44 బంతుల్లో ఒక ఫోర్‌తో 24 పరుగులు, బి.హర్షిత 55 బంతుల్లో రెండు ఫోర్లతో 22 పరుగులు చేశారు. సెంట్రల్ జోన్ బౌలర్ కె.ధాత్రి 6.5 ఓవర్లలో 11 రన్స్ ఇచ్చి నాలుగు వికెట్లు తీసింది. అనంతరం 131 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సెంట్రల్ జోన్ జట్టు 32 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి విజయాన్ని సాధించింది. జట్టు బ్యాట్స్ ఉమెన్ కేఈ దయానా 84 బంతుల్లో తొమ్మిది ఫోర్లతో 57 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది.

ఎన్ఎస్పీ కాల్వ ఆక్రమించి గెస్ట్ హౌస్ నిర్మాణం

- మాజీ ఎమ్మెల్యే జీవీ నిర్వాకం
- విచారణ చేపట్టిన, రెవెన్యూ, ఎన్ఎస్పీ, సర్వే, అధికారులు
- ఆక్రమణలపై త్వరలో నోటీసులు



కాల్వ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వినుకొండ(నూజెండ్ల): మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దురాగతాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా పెరుమాళ్లపల్లి మేజర్ కింద సబ్ మైనర్ కాల్వ ఆక్రమించుకుని గెస్ట్ హౌస్ నిర్మాణం బాగోతం బయటకు వచ్చింది. జిల్లా ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ, సర్వే, ఎన్ఎస్పీ అధికారులు కలసి తనిఖీ చేశారు. వివరాలు... ఈపూరు మండలం బోడిశెంబునివారి పాలెం గ్రామ పంచాయతీ పరిధిలో పెరుమాళ్లపల్లి నుంచి పెదకంచర్ల వెళ్లే 3.4 మీటర్లు వెడల్పు ఉన్న సబ్ మైనర్ కెనాల్ కాల్వను రైతుల నుంచి గతంలో ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే, రెండు కిలోమీటర్లు పొడవునా కాల్వ ఆక్రమణకు గురైయిందని అధికారులు గుర్తించారు. ఇందులో వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బోడిశంబునివారిపాలెం పంచాయతీ పరిధిలో 3.4 మీటర్లు వెడల్పు గల కాల్వను ఆక్రమించికుని గెస్ట్ హౌస్ నిర్మాణం చేశారు. దీనిపై మూడు రోజుల్లో విచారణ చేసి ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తామని తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్పీ డీఈ ఈ.శ్రీదేవి, ఏఈఈ విజయ్, వీఆర్వో నాగరాజు, మండల సర్వేయరు టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి గురువులదే..



ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్‌ను సత్కరిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఏపీసీ విజయలక్ష్మి



అమృత విశ్వ విద్యా పీఠం క్యాంపస్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తి ఉందని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 31 మంది ఉపాధ్యాయ, అధ్యాపకులను ఆదివారం అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరున స్థాపించిన ట్రస్టు ద్వారా 15 ఏళ్లుగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, ప్రతి ఏటా వారిని సత్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు దంపతుల కృషి అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ దినోత్సవానికి ముందస్తుగా ఉత్తమ సేవలతో పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమాజంలో విద్యాభివృద్ధి కోసం మరింతగా శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి, లయన్స్ క్లబ్స్ జిల్లా మాజీ గవర్నర్ ఎస్.వీర ప్రకాష్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, కె.విజయకుమారి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత స్థానం

మంగళగిరి: క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేర్చుతుందని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కురగల్లు గ్రామంలో అమృత విశ్వ విద్యాపీఠం క్యాంపస్ -2023-24 ప్రారంభ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మాలను పాటిస్తూ విద్యను అందిస్తున్న అమృత విశ్వ విద్యాపీఠం ఎంతో విశిష్టతను కలిగి ఉందన్నారు. అనంతరం ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డికి నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో అమృత విశ్వ విద్యాపీఠం అడ్మినిస్ట్రేషన్ డీన్ రాజేంద్రకుమార్, డైరెక్టర్ స్వామి సదానంద శివపురి, బిజినెస్ స్కూల్ డీన్ రఘురామన్, ప్రిన్సిపాల్ రాజా తిలగం, స్వామిని గురుచరణామృత ప్రాణ, స్వామి గురు పరమామృత, పాములపాటి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మ పీడీ రామారావు అనారోగ్యంతో మృతి



పెదకాకాని: గుంటూరు జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గుడికందుల రామారావు(59) అనారోగ్యంతో మృతి చెందాడు. నాదెండ్ల మండలానికి చెందిన ఆయన గత కొంతకాలంగా ఇల్లు తీసుకుని పెదకాకానిలోనే నివసిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన వరంగల్, శ్రీకాకుళం జిల్లాలలో వ్యవసాయ శాఖ జేడీగా, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో ఏడీ, ఏడీ, డీడీగా పని చేశారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఆయన స్వగ్రామం నాదెండ్లలో ఈ నెల 5వ తేదీ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పీడీ రామారావు మృతదేహాన్ని పలువురు వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించి నివాళులర్పించారు.

కార్మికవర్గ ఐక్యతతోనే ఫాసిజం ఓటమి

ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

పాత గుంటూరు: విశాల ఐక్యత ద్వారా ఫాసిజాన్ని ఓడించటమే కార్మికవర్గం ముందున్న కర్తవ్యమని పౌరహక్కుల ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కార్మికోద్యమ నిర్మాత ఎంవీఎస్ కపర్దీ శత జయంతి ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. తొలుత కపర్ది చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభకు ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్, వర్తమాన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు-కార్మిక వర్గం పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. కార్మికులకు కనీస హక్కులు, మెరుగైన జీవనవిధానం ఉండాలని, శ్రమ శక్తికి సామాజిక గౌరవం దక్కాలని కపర్దీ ఎన్నో పోరాటాలు సాగించారని, ఆయన ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. దేశంలో హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని కాపాడటానికి కార్మికవర్గం మరోసారి పోరాటాలకు పూనుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన చారిత్రక అవసరం నేడు మనముందుందని ఏఎన్‌యూ ప్రొఫెసర్ వి. అంజిరెడ్డి అన్నారు. భారత ప్రజాస్వామ్యం రాజ్యాంగం- ఒక పరిశీలన' అనే అంశంపై ఆయన మాట్లాడారు. భారతదేశంలోనే కాక అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో కూడా ప్రజాస్వామ్యం సంక్షోభంలోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక ఉద్యమ నేత కపర్దీ ఆశయ సాధనకు మరింత పట్టుదలతో పనిచేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. అనంతరం ఇటీవల అరసం జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన పెనుగొండ లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. కపర్దీ కుమారుడు మండలపర్తి కిశోర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులు సోమసుందర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, కపర్దీ కుటుంబ సభ్యుడు జగన్‌మోహన్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ డైరెక్ట్ 10th, ఒకే సం॥లో ఇంటర్ 3 సం॥రాలలో ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BSc, B.Com, BA లకై సంప్ర॥ శ్రీ సత్యనంద్య కాలేజ్ 4/18 బ్రాడీపేట, గుంటూరు. Ph: 9346446079

■ 10th, ఇంటర్(ఒకేసం॥లో), డిగ్రీ(1-3సం॥లో) BA, BCom, BSc, MA, MCom, MBA, MSc (All Groups) పాస్ గ్యారంటీ శిక్షణ, సంప్ర॥శ్రీవెంకటేశ్వర ఇన్స్టిట్యూట్, 2/11 బ్రాడీపేట.Gnt 8008145999

■ Wanted a Job and Acquire Good Knowledge, Join in Four Year Degree Revolution with BBA, B.Sc Electronics, B.Sc Comp Science, B.Com Comp App 9177408565

■ Wanted a Job and Acquire Good Knowledge, Join in Four Year Degree Revolution with BA Special English, BA Economics, BA History. 9177408565

■ Eligible for scholarships, join 4year Degree at PLNM Degree College with BBA, B.Sc Comp / Electronics, B.Com Comp App, BA Ecom/ Spel English / History. Only Few Seats Left. 9177408565

PARAMEDICAL

■ ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radiographic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry, ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఏదీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజ్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55686, 96408 24225

REAL ESTATE

■ గుంటూరు సిటీకి అతి చేరువలో వున్న నంబూరు, బుడంపాడు, గార్లవారిపాలెం, లాం, కొన్నల గడ్డ, తాడికొండ, అడ్డరోడ్డు బ్యాంక్ లోన్‌తో CRDA అప్రూవల్ ప్లాట్లు కలవు. 7794960734

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 9659057777

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

WANTED

■ మా ఆఫీసు న్యూ ప్రాంచైజ ద్వారా మా ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్ /ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు నుండి ఆపైన సంపాదించే అవకాశం. Cont: 88854 86421

■ Wanted Male Marketing Vice Principals. Qualification Any Degree Must be Married Salary upto : 20,000/- Place of Work Master Minds College, Guntur. Contact: 9248733344

■ GNT కాకానిరోడ్ + అరండల్‌పేటలో వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్+ డ్రాయింగ్ ... 70' కావలెను. ... TSAM-6PM, జీ:8000/--13000/- P/T, F/T స్పాట్ జాయినింగ్. 7780169456, 9985725148

■ ప్రముఖ కంపెనీ నందు ఆర్గానిక్ ఎరువులను సేల్స్ చేయుటకు యువతి యువకులు కావలెను. జీతం:15K ఆపైన రూం + భోజనం బైక్ మస్ట్ వెంటనే జాయినింగ్. 9493357516

■ గుంటూరు లోకల్‌లో చదల నివారణ పని చేయుటకు వర్కర్స్ పు/లు కావలెను. వయస్సు: 18-40, టైమ్: 9am to 6pm. Ph: 7013674154

■ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్ డిస్ట్రిబ్యూషన్ మేనేజర్స్ ఇన్సూరెన్స్ మేనేజర్స్ కావలెను. P/T వర్క్ ఫ్రమ్ హోమ్. ఫిక్స్‌డ్ శాలరీ+ఇన్సెంటివ్స్ మార్కెటింగ్ & రిటైర్డ్ పర్సన్‌కి ప్రాధాన్యత. 9949839400

■ డ్యూటీ డాక్టర్స్, ఫామ్-డి, నర్సెస్, రిసెప్షనిస్ట్స్, వాచ్‌మెన్ కావలెను. ఆహల్య నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 9246427459

■ హోటల్ కుంభకర్ణ కొరిటిపాడు, గుంటూరు నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్(బాయ్) కావలెను. ఉ॥ 6 నుండి మ॥2గం వరకు జీతం 10వేలు. సంప్ర॥ 9885109440

■ LOT మొబైల్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్యాషియర్ కావలెను. జీతం: Take Home 12500 ఆపైన, 4/7, బ్రాడీపేట, గుంటూరు. సంప్ర॥ 7330624555

■ గృహిణులు, రిటైర్డ్ ఎంప్లాయిస్, స్టూడెంట్స్ మార్కెటింగ్ అసోసియేట్స్, ఇంటి వద్దనే ఉండి నెలకి ఆకర్షణీయమైన జీతం ఆపైన సంపాదించే అవకాశం మంత్లీ మెయింటెనెన్స్ డైలీ అలవెన్స్ కలవు. RR's ఇన్‌ఫ్రా డెవలపర్స్, నరసరావుపేట. 8827894789

■ ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు 3సం॥లు అనుభవంకలిగిన అకౌంటెంట్&బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ సివిల్ ఇంజనీర్ కావలెను. ఫోన్ చేయవలసిన సమయం: 3PM-6PM ✆ 9248198399

■ APSRTC బస్టాండ్ ఆవరణ నందు గ్రౌండ్ బుకింగ్‌లో పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. 9705263264

■ ప్రముఖ కంపెనీ గుంటూరు నందు పనిచేయుటకు మార్కెటింగ్ స్టాఫ్ టెలికాలర్స్ ఆఫీస్ స్టాఫ్, మహిళలు కావలెను. జీతం+అలవెన్సులు సంప్ర॥ 9000369657, 8639578021

■ గుంటూరు బస్టాండ్ దగ్గర ప్రముఖ సంస్థ నందు వర్క్ చేయుటకు లేడీ టెలి కాలర్స్ కావలెను. జీతం : 8 వేలు - 10 వేలు ✆ 8886131834

■ గుంటూరు,గుజ్జనగుండ్ల,పలకలూరురోడ్ నందు పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్, హౌస్ కీపింగ్, సూపర్‌వైజర్స్ కావలెను. 12గం॥డ్యూటీ, గార్డ్స్ జీతం:13500. 12గం॥డ్యూటీ ✆ 8100097782

■ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ నందు పనిచేయుటకు లేడీకౌన్సిలర్స్ కావలెను. ఓవర్సీస్ ఎడ్యుకేషన్‌లో అనుభవం గలవారికి ప్రాధాన్యత. ఉ.డిగ్రీ, MBA. జీ:15K-ఆపైన ✆ 9866649903

■ గుంటూరులోని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ నందు మార్కెటింగ్ మరియు టెలికాలింగ్ చేయుటకు వివాహితులైన స్త్రీలు కావలెను. Q: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. ✆ 86396 89939, 90309 93895

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ నెంబర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97030 13015
97034 67843
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భర్తపై హత్యాయత్నం

- ఇంట్లో విలువైన వస్తువుల ధ్వంసం
- బంగారం, నగదు దోచుకెళ్లిన వైనం
- భర్త ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- నిడమర్రులో వెలుగుచూసిన ఘటన



దాడిలో ధ్వంసమైన ద్విచక్ర వాహనం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నిడమర్రులో భర్తపై హత్యాయత్నం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు... నిడమర్రుకు చెందిన దారం గోపాలకృష్ణ 2019లో తాడేపల్లికి చెందిన ఇట్టా నాగలక్ష్మిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అనంతరం ఉద్యోగరీత్యా అద్దంకిలో కాపురం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తడంతో ఇద్దరు విడిపోగా గోపాలకృష్ణ తన స్వగ్రామం నిడమర్రుకు తిరిగి వచ్చి భార్య నాగలక్ష్మితో విడాకుల కోసం కోర్టులో దరఖాస్తు చేసుకున్నాడు. వివాదం కోర్టులో నడుస్తుండగా ఈ ఏడాది ఆగస్టు 18వ తేదీన అర్ధరాత్రి సమయంలో గోపాలకృష్ణ సతీమణి నాగలక్ష్మి ఆమె బంధువులు బత్తుల సరోజని, ఇట్టా వర్ధన్, వంశీలతో కలసి నిడమర్రులోని తన భర్త నివాసానికి చేరుకుని ఇంటిలోని వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు బంగారం, నగదును తీసుకువెళ్లారు. దీంతో గోపాలకృష్ణ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయగా పోలీసులు రాజీ చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. రాజీ వద్దని, తన భార్యతోపాటు ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళగిరి రూరల్ పోలీసులను కలసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు గోపాలకృష్ణ ఆదివారం తెలిపాడు. తనపై దాడి చేసిన వారిపై రాష్ట్రంలోని పలు స్టేషన్లలో అనేక కేసులు నమోదై ఉన్నట్లు ఆరోపించాడు. ఈ విషయమై రూరల్ ఎస్ఐ క్రాంతికిరణ్ వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిందని, కానీ రాజీ చేసుకుంటామని తెలిపారని, దీంతో కేసు నమోదు చేయడంలో జాప్యం జరిగిందని తెలిపారు. అయితే రాజీ కుదరలేదని బాధితులు ఫిర్యాదు చేయడంతో శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

తాడికొండ: అతివేగంగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకులను ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన తాడికొండ అడ్డరోడ్డు నుంచి పొన్నెకల్లు రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడికొండకు చెందిన బొబ్బిలి రాజ్‌కుమార్(25), మరో యువకుడు వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం ఉదయం పొన్నెకల్లు వెళ్లి వస్తుండగా మెటల్ లోడుతో వస్తున్న లారీ వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ తగలడంతో బైక్ పక్కకు పడిపోయింది. ఘటనలో రాజ్ కుమార్ పొట్ట భాగంపై లారీ ఎక్కడంతో ఘటనా స్థలంలోనే యువకుడు ప్రాణాలొదిలాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించారు. మృతుడు రాజ్ కుమార్‌కు వివాహం అయి ఏడాది కావస్తుంది, ప్రస్తుతం భార్య 8వ నెలల గర్భిణిగా ఉంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అచేతనంగా పడి ఉండటంతో ఘటనా స్థలంలో బంధువుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పేరేచర్ల కొండ ప్రాంతం నుంచి అధిక లోడులతో వస్తున్న మెటల్ లారీలు సింగిల్ రోడ్లపై వాహనాలకు సైడ్ ఇవ్వకుండా పరిమితికి మించిన వేగంతో వెళుతుండటంతో నిత్యం ప్రమాదాలకు నిలయంగా రోడ్లు మారాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

కొరిటిపాడు: గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా పొన్నూరు మండలంలో 137.2 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా కొల్లిపర మండలంలో 9.6 మి.మీటర్ల వర్షం కురిసింది. సగటున 49.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

మంచాల(చేబ్రోలు): ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడగా లారీ పైగా వెళ్లడంతో మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గుంటూరు సమీపంలో నల్లపాడు చల్లావారిపాలేనికి చెందిన వంకాయలపాటి వైష్ణవి(38), రవిబాబు దంపతులు రేపల్లె మండలం కల్లేవారిపాలెంలో బంధువుల వివాహానికి శుక్రవారం వెళ్లారు. ఆదివారం బైక్‌పై గుంటూరు బయలుదేరారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామ సమీపంలోని పెట్రోలు బంకు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. బైక్ మీద నుంచి వైష్ణవి తారు రోడ్డుపై పడింది. రవిబాబు రోడ్డు మార్జిన్‌లో పడ్డాడు. తారు రోడ్డుపై పడిన వైష్ణవిని అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఎక్కటంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. రవి రిటైర్డు ఆర్మీ ఉద్యోగి. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాగర్లమూడి లాకుల వద్ద..

చేబ్రోలు: రోడ్డు దాటుతుండగా వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వడ్లమూడి గరువుపాలెం సమీపంలోని సంగం జాగర్లమూడి లాకుల వద్ద రోడ్డు దాటుతున్న నూతక్కి వెంకటస్వామి(45)ని తెనాలి నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కు తీర్చుకొని వస్తూ రోడ్డు ప్రమాదంలో..

సత్తెనపల్లి: మొక్కు తీర్చుకొని వస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామానికి చెందిన జైగౌడ్ ఉద్యమ పల్నాడు జిల్లా అధ్యక్షుడు గాలి రాము పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మకు మొక్కుబడి తీర్చుకునేందుకు ఆదివారం ఏర్పాట్లు చేసుకొని, గ్రామస్థులు కొందర్ని ఆహ్వానించాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన చల్లా రామకృష్ణారెడ్డి (60), ఆయన సోదరుడి కుమారుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై పెనుగంచిప్రోలు వెళ్లారు. అక్కడ మొక్కుబడి తీర్చుకొని భోజనం చేసి తిరిగి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పెనుగంచిప్రోలు క్రాస్ రోడ్డు వద్ద సర్వీస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డులోకి ఎక్కుతున్న క్రమంలో వెనుక నుంచి లారీ వచ్చి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో వెనుక కూర్చున్న చల్లా రామకష్ణారెడ్డి ఎగసిపడి పడ్డాడు. రోడ్డుకు తల పాడుచుకొని బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న మృతుని సోదరుని కుమారుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి హెల్మెట్ పెట్టుకోవడంతో ప్రాణపాయం నుంచి తప్పించుకుని, గాయాలతో బయటపట్టాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌పై దాడి అవాస్తవం

సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ముప్పాళ్ల పోలీస్ స్టేషన్‌పై గానీ, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌పై గానీ దాడి జరగలేదని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ చెప్పారు. పట్టణ పోలీస్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి అవాస్తవమని, కేవలం ప్రచారం తప్పా నిజం లేదని తెలిపారు. ముప్పాళ్ల మండలం బొల్లవరం గ్రామానికి చెందిన ఈవూరి వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం రాత్రి గుంటూరు నుంచి స్వగ్రామానికి కారులో వెళుతున్నారని తెలిపారు. అదే సమయంలో నరసరావుపేట నుంచి సత్తెనపల్లి వైపు ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో వస్తున్న ఇద్దరు యువకులు మద్యం మత్తులో కారును తగలబోయారన్నారు. దీనిపై వెంకటేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేయడంతో యువకులు రెచ్చిపోయి కారుకు ద్విచక్ర వాహనాన్ని అడ్డుగా పెట్టి, అద్దాల్ని పగులగొట్టారని డీఎస్పీ తెలిపారు. వెంకటేశ్వరరెడ్డిని ముఖంపై కొట్టారని, జేబులో నుంచి రూ.500 లాక్కొని వెళ్లారని చెప్పారు. దీనిపై వెంకటేశ్వరరెడ్డి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. వెంకటేశ్వరరెడ్డిని కొట్టారనేది తెలియడంతో ఆయన సానుభూతిపరులు చాగంటివారిపాలెం, బొల్లవరం నుంచి ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారని చెప్పారు. ఆ సమయంలో తనతో పాటు సత్తెనపల్లి రూరల్ సీఐ ప్రేమయ్య అక్కడకు చేరుకొని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారంతా శాంతించి వెళ్లారని వివరించారు. ఎటువంటి ఘర్షణ వాతావరణం లేదన్నారు. అలాంటప్పుడు లాఠీచార్జి ఎందుకు చేయాల్సి ఉంటుందని డీఎస్పీ ప్రశ్నించారు. ఘటనకు కారకులైన రావూరి సాయికృష్ణ, శివపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇద్దరు యువకులను పూర్తి స్థాయిలో విచారిస్తున్నామని, త్వరలోనే ఆ వివరాలను కూడా మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు. ముప్పాళ్ల ఎస్ఐ కిశోర్ మాట్లాడుతూ తనపై ఎలాంటి దాడి జరగలేదని చెప్పారు. సమావేశంలో పట్టణ సీఐ యు.శోభన్‌బాబు, సత్తెనపల్లి రూరల్ సీఐ ప్రేమయ్య, సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ రఘుపతి పాల్గొన్నారు.